క్లుప్తంగా

పచ్చిరొట్ట సాగు చేయండి

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసారం పెంచేందుకు జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం వలన పొలంలో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి తులసిరాం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రైతులకు జనుము, జీలుగ సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మట్లాడుతూ ప్రతి రైతు జనుము సాగు చేస్తే భూసారం పెరుగుతుందని సూచించారు.

బ్రహ్మలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

నింద్ర: మండలంలోని ఎలకాటూరులో వెలసిన పురాతన కామాక్షి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనుము పంపిణీ

గంగాధర నెల్లూరు: మండలంలో రైతులకు గురువారం నుంచి జనుము పంపిణీ చేయనున్నట్లు ఏఓ భవానీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 కేజీల జనుము బస్తా రూ.1090 కాగా 50 శాతం సబ్సిడీతో రూ.545కే రైతులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. జీడీనెల్లూరు, వేల్కూరు, పాపిరెడ్డిపల్లి, నెల్లేపల్లి రైతు సేవా కేంద్రాల్లో పాస్‌బుక్ ఆధార్ కార్డుతో రైతులు నేరుగా వెళ్లి జనుము విత్తనాలను పొందవచ్చన్నారు.

నేత్రపర్వంగా వేంకటేశ్వరుడి కల్యాణం



పద్మావతి, వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

పెనుమూరు(కార్వేటినగరం): టీటీడీ అనుసంధానంగా ఉంటున్న కలిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి యాగశాల, వైధిక కార్యక్రమాలు, మహాపూర్ణాహుతి, యంత్రదానం కుంభ ప్రదక్షణ చేపట్టారు. అనంతరం శ్రీపద్మావతి, వేంకటేశ్వర స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పద్మావతి అమ్మవారి శిరస్సుపై ముత్యాల తలంబ్రాలు పోసి అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుదరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై ప్రతిష్టించి ఆలయ మాడవీధుల్లో చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. దీంతో ఈ నెల 23వ తేదీ నుంచి ఆలయంలో జరుగుతున్న జీర్ణోద్ధారణ కార్యక్రమాలు ముగిశాయి.



ఇతని పేరు పి.లక్ష్మణ్. నగరి మునిసిపాలిటీ ధర్మాపురానికి చెందిన ఇతనికి పుట్టుకతో కళ్లు కనిపించవు. తల్లిదండ్రుల మీదే ఆధారపడి బతుకుతున్నాడు. ప్రభుత్వం సాయం ఉంటుంది అది ఎలా తీసుకోవాలన్న అంశంపై ఇతనికి గానీ, ఇతని కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి అవగాహన లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అడగాలన్నా రాజకీయ పలుకుబడి లేకుండా అందుతుందా అనే సంశయం ఉండేది. గత ప్రభుత్వంలో వలంటీర్ల సర్వేలో ఇతనికి పెన్షన్ రావడం లేదన్న అంశం గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఇతనికి పెన్షన్ మంజూరైంది. ఆ పింఛనే అతనికి మద్దతుగా నిలుస్తోంది.

ఏడాదిలోనే ఆ సేవలన్నీ మాయం

- సర్టిఫికెట్‌కూ తప్పని ప్రదక్షిణలు
- ఇంటి వద్దకు అందని వైద్య సేవలు
- సకాలంలో అందని విత్తనాలు ఎరువులు
- రేషన్ సరుకుల కోసం తప్పని క్యూలు





ఇంటి వద్దే వైద్యసేవలు అందుకుంటున్న ఆదిలక్ష్మమ్మ(ఫైల్)



దామరపాకలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, పుత్తూరులో స్పృహతప్పి పడిన పశువుకు అక్కడే వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

నగరి: గత ప్రభుత్వం గడప గడపకు సేవలు అందించి ప్రజల వద్దకే సుపరిపాలన అందించింది. సమస్యలకు చక్కని పరిష్కారం చూపింది. వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి ఏమి అవసరమవుతుందో సర్వేలు చేయించి వారికి కావలసిన సేవలను, అవసరాలను గడప వద్దే అందించింది. పెన్షన్‌కు ఎలా దరఖాస్తు చేసుకోవాలో, రేషన్ కార్డుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో, సర్టిఫికెట్లు ఎలా పొందాలో తెలియని వారి సమస్యను తెలుసుకుని వారి అవసరాలు తీర్చింది. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో వైద్యసేవలు గ్రామాలకే వచ్చాయి. ప్రతి ఇంటికీ వెళ్లి రక్త పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, వ్యవసాయ సలహాలు, సూచనలు అత్యంత సమీపంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో రైతులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగకుండా, దళారులను నమ్ముకొని వేలకు వేలు ఖర్చు చేయకుండా సేవలు వారి గడప వద్దే అందాయి. గడప గడపకు సేవలు అందుతున్నాయా లేదా అని స్థానిక ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికీ వెళ్లి అడిగి తెలుసుకొని వీధులకు రోడ్లు, కాలువలు, అవసరమైన నీటి వసతి లాంటి వాటిని కూడా పరిష్కరించారు. ఇలా నాడు పార్టీలకతీతంగా గడప గడపకూ సేవలు అందింది.

నేడు సమస్యల వెల్లువ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సేవలు అందించే వలంటీర్లను తొలగించేసింది. దీంతో ప్రతి ఇంటికీ వెళ్లి ఏ అవసరాలున్నాయో లెక్కించే ప్రక్రియ మూలన పడింది. ఇక ఇంటి పట్టాలు, నిర్మాణాలు లేవు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయింది. రేషన్ సరఫరా వాహనాలు ఆగిపోయాయి. దుకాణాల వద్ద క్యూలు కనిపిస్తున్నాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమౌతోంది. పలు సచివాలయాల్లో సర్టిఫికెట్లు ప్రింట్ తీయడానికి ప్రింటర్లు కూడా పనిచేయని పరిస్థితి ఉంది. ఏ పని కావాలన్నా కార్యాలయాల చుట్టూ, నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. దళారులను నమ్ముకుంటే వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. తాగే నీరు కూడా సక్రమంగా రావడం లేదు. మూలన పడ్డ మోటార్లు రిపేర్లు చేయలేని పరిస్థితి నెలకొంది.

నాడు రక్ష నేడు కక్ష



నేను తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గతంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామంలోనే ప్రతి ఒక్కరూ ఇంటి వద్దకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించేవారు. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ, థైరాయిడ్ లాంటి వ్యాధులకు ఇంటి వద్దకే వచ్చి రక్త పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఇచ్చేవారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఆ సేవలు అందడం లేదు.

–గణేశ్, ఈఆర్ కండ్రి గ్రామం, గంగాధర నెల్లూరు మండలం

రేషన్‌కార్డు అందడం లేదు



నాకు పెళ్లై దాదాపు పదేళ్లు కావస్తుంది. నాకు ఇద్దరు పిల్లలు. గత ప్రభుత్వంలో కొత్త బియ్యం కార్డు మంజూరైంది. ఆ కార్డులో నా రెండో బిడ్డను రేషన్ కార్డులో చేర్పిద్దామని సచివాలయంలో దరఖాస్తు చేయగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అది సాధ్యం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రేషన్ కార్డు, మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. కానీ ఇంతవరకు నా బిడ్డను కార్డులో యాడ్ చేసుకోలేకపోతున్నాను.

–బి.రేఖ, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం మండలం

నాటి ఆశ.. నేడు ఆవిరైంది

నాడు నా ఆరోగ్యానికి భరోసా ఉండేది. నేడు అది ఆవిరైంది. కొన్నేళ్లుగా పెరాలసిస్‌తో బాధపడుతున్నా గత ప్రభుత్వంలో డాక్టర్‌తో పాటు నర్సులు నా ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందించే వారు. ఒక సారి కాదు నెలలో రెండు దఫాలు నా ఇంటి వద్దకే డాక్టరు వచ్చేవారు. దీంతో నా ఆరోగ్యం మెరుగవుతుందనే నమ్మకం ఉండేది. అయితే ఇప్పుడు ఒక ఏడాదిగా ఆ డాక్టర్ గానీ, నర్సులు గానీ మా ఇంటికి రావడం లేదు.

–ఎస్.ఆదిలక్ష్మమ్మ, రామసముద్రం, పుత్తూరు మండలం

పదేళ్ల తరువాత పక్కా ఇల్లు

ఎప్పుడు పడిపోతుందో తెలియని పూరిగుడిసెలోనే పదేళ్లుగా జీవించాను. పక్కా ఇల్లు కట్టుకుంటానని కలకూడా కనలేదు. గత ప్రభుత్వం చేసిన సర్వేలో ఇంటివద్దకు వచ్చిన వలంటీరు ఇంటి పరిస్థితి చూసి నాకు స్థలం ఉంది ఇల్లు లేదని ప్రభుత్వానికి తెలియజేశాను. దీంతో నాకు రూ.1.80 లక్షలు మంజూరైంది. పక్కా ఇల్లు కట్టుకున్నాను. పెన్షన్ కూడా అందుతోంది. నిజంగా నేను ఊహించని సాయం అందుకుంటున్నాను. –కన్నెమ్మ, అత్తూరు దళితవాడ, నింద్ర మండలం

సర్టిఫికెట్‌కు తప్పని తిప్పలు



గతంలో విద్యాసంవత్సరం ఆరంభ సమయంలో అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు ఇంటి వద్దకే అందించారు. దరఖాస్తు చేసిన వారికి వలంటీర్లే ఇంటి వద్దకు తెచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇటీవల నా భార్యకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ అవసరమైంది. ఆ సర్టిఫికెట్ పొందడానికి పడిన తిప్పలు అన్నీఇన్నీ కావు. కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే 16 రోజుల తరువాత ఒక సర్టిఫికేట్ అందింది.

–గోవర్ధన్, గుండ్రాజుకుప్పం దళితవాడ, నగరి మండలం

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి



ప్రసాదం స్వీకరిస్తున్న మాజీ మంత్రి రోజా

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏజీ మణి తల్లి సంపూర్ణమ్మ ఇటీవల ఆకస్మికంగా మరణించారు. సమాచారమందుకున్న మాజీ మంత్రి ఆర్కేరోజా బుధవారం వారి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బీడీ భాస్కర్, కౌన్సిలర్లు గంగాధరం, భూపాలన్, నాయకులు బాబు, అయ్యప్ప, మురుగ, జగన్ పాల్గొన్నారు.

గంగమ్మ సన్నిధిలో రోజా

పుత్తూరు: మండలంలోని నేసనూరు పంచాయతీ గట్టు గ్రామంలో బుధవారం నిర్వహించిన గంగ జాతరలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మకు సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అలరించిన అర్జున తపస్సు



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని తయ్యూరు పాయికట్టు అంకనపల్లి వద్ద జరుగుతున్నా శ్రీద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీదేవి ఉత్సవ మూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సుమాను వద్దకు చేరుకున్నా అర్జున వేషధారి, తపస్సు ఘట్టానికి సంబంధించిన పద్యాలను ఆలపిస్తూ అధిరోహించారు. ఈ క్రమంలో తీసుకెళ్లిన విబూధి, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు సంతానం కోసం తపస్సుమాను కింద పడుకుని స్వామివారిని వేడుకున్నారు. అర్జున తపస్సుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, నిర్వాహకులు రామనాథరెడ్డి, లోకనాథం, మణి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు విలువ లేదు

విజయపురం: కూటమి ప్రభుత్వంలో సర్పంచులకు విలువ, గుర్తింపు లేదంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ కార్యదర్శి పి.గోవర్ధన్ నాయుడు అన్నారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పంచాయతీ ప్రథమ పౌరులు (సర్పంచులు) ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారన్నారు. పంచాయతీ వ్యవస్థ పూర్తిగా చచ్చిపోయిందన్నారు. ప్రజలు నేరుగా ఎన్నుకున్న సర్పంచ్‌లను అధికారులు పట్టించుకోకుండా, అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. అవసరం లేని చోట సీసీ రోడ్లు వేసి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కార్వేటినగరం: భార్య వదిలేసి వెళ్లడంతో పాటు పిల్లలు పట్టించుకోవడం లేదని బాధతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. మండలంలోని విజయమాంబపురం గ్రామానికి చెందిన చెంగయ్య(60) గత కొన్నాళ్లు ఇంట్లో పరిస్థితులు సరిగా లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఏడేళ్ల కిందట భార్య వదిలేసి పోయింది. పిల్లలు సైతం చెంగయ్యను పట్టించుకోకపోవడంతో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి చనిపోయాడు. కుటుంబ సభ్యులు గుర్తించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చెంగయ్య మృతి చెందడంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



సచివాలయ ఉద్యోగుల యోగాసనాలు



యోగా శిక్షణలో పాల్గొన్న మహిళలు

పాలసముద్రం: యోగా చేయడం ద్వారా మన ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని ఎంపీడీఓ కృష్ణ మహేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ ఆవరణలో సచివాలయ ఉద్యోగులకు ఆయన యోగాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రశాంత జీవనాన్ని గడిపేందుకు దోహద పడుతుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే యోగాపై ఆసక్తి, అవగాహన పెంపొందించాలన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ రోజుకు గంటసేపు యోగా చేస్తే వారి ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయ ఉద్యోగులు ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వడమాలపేట (విజయపురం): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు అని యోగా గురువు భవన్ దాస్ అన్నారు. మండలంలోని కాయం గ్రామంలో రెండవ రోజు మహిళలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు యోగాపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగాసనాలు ఒక భాగం కావాలని, ఆరోగ్యంగా జీవించేందుకు యోగాసనాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ సతీష్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సచివాలయ సిబ్బందికి యోగాపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ లోకేష్, హోమియోపతి డాక్టర్ ఆశ అంజుమ్, యోగా శిక్షకులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఖరీఫ్ సాగులో రైతన్న బిజీ..



వెంగళరాజుకుప్పంలో వేరుశనగ పంటలో కలుపు తీస్తున్న కూలీలు

పాలసముద్రం: మండలంలో వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పంటల సాగు, కలుపు తీసే పనులు ప్రారంభించారు. రెండో విడత దుక్కులు చేయడంతో పాటు మరికొందరు నాట్లు వేస్తున్నారు. మండలంలో బోరుబావుల కింద ఉన్న రైతులు సుమారు 985 హెక్టార్ల భూమిలో వరి పంటలు, మరి కొంతమంది రైతులు 657 హెక్టార్లలో వేరుశనగ సాగు చేస్తున్నారు. రైతులు ఏ పంట సాగు చేసినా ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడం వల్ల భూములు మొద్దుబారిపోయి దిగుబడి తగ్గిపోతుంది. అందుకు ప్రత్యామ్నాయంగా జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

వేణుగోపాలుడికి విరులయాగం





కార్వేటినగరం : వేణుగోపాలుడికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేద పండితులు, నగర వీధుల్లో విహరిస్తున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారికి బుధవారం పుష్పయాగం అంగరంగ వైభవంగా జరిగింది. అత్యంత శోభాయమానంగా సాగిన ఈ మహోత్సవాన్ని తిలకించి అశేష భక్తులు తన్మయత్వం చెందారు. కర్ణాటక, తమిళనాడుకు చెందిన భక్తులు పలువురు స్థానికులు పుష్పాలను విరివిగా విరాళంగా సమర్పించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కంకణభట్టు తరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పుష్పయాగం నిర్వహించారు. సాయంత్రం 4.45 నుంచి 7 గంటల వరకు స్వామివారు తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం రాత్రి 8.45 గంటల సమయంలో స్వామివారిని ఏకాంతసేవలో పవళింపజేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, వేదపండితులు దాశరథి, గోపాలచారి, అలంకార భటులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



పుష్పయాగాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులు

ఆకతాయిల బైండోవర్



కటింగ్ షాపులో వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిని బైండోవర్ చేస్తున్న పోలీసులు

శ్రీరంగరాజపురం: గ్రామాల్లో అల్లర్లు, గొడవలు చేసే ఆకతాయిల ఆటకట్టిస్తామని నగరి డీఎస్పీ సయ్యద్ అమ్మద్ అజీజ్ అన్నారు. మండల పరిధిలోని పిళ్లారికుప్పం క్రాస్ రోడ్డులో కటింగ్ షాపులో పని చేసే ఓ వ్యక్తిని చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన చందు, ప్రశాంత్, ఉదయ్ యువకులు బుధవారం మద్యం సేవించి కటింగ్ షాపులో పని చేసే వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన వీడియో వైరల్ అయింది. ఈ సంఘటన గురించి తెలుసుకున్న నగరి డీఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ సుమన్ షాపులో దాడికి పాల్పడిన యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం ఎస్‌ఐ సుమన్ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం, గంజాయి సేవించి అల్లర్లు, గొడవలు చేసే యువకులపై రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా అలాంటి సంఘటనలు జరిగితే 9440900692 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.